క్లుప్తంగా

180 మందికి వైద్య పరీక్షలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ కార్యాలయంలో గురువారం 180 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని అమరావతి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో పలు హాస్పిటల్స్ పాల్గొని కంటి, ఎముకలు, డెంటల్, వినికిడి, జనరల్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి వైద్య పరీక్షలను డాక్టర్ నాదెండ్ల వేణు, కేతినేని శైలజ, మిత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎముకల పరీక్షలను డాక్టర్ భాస్కర్ ప్రకాష్, కె.వి.సత్యనారాయణ, దుహిత హాస్పిటల్ డాక్టర్ నల్లూరి శశిధర్ దంత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ జీఎం సయ్యద్ అద్నాన్ మాట్లాడుతూ.. ఖర్చుతో కూడుకున్న వైద్య పరీక్షలను ఈ వైద్య శిబిరంలో ఉచితంగా నిర్వహించామన్నారు. ముందు ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అమరావతి ఐ హాస్పిటల్ మార్కెటింగ్ హెడ్ షంషుద్దీన్, ఆడియాలజిస్ట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విజయాలు సాధించాలని డీజీ విశాల్‌గున్ని అన్నారు. కానూరులోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ 1వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో మెలిగి చదివితే లక్ష్యం సాధించగలుగుతారన్నారు. విద్యార్థులు ప్రతిభ, అంకితభావం, సృజనాత్మకత ప్రదర్శించగలిగితే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. షామ్రాక్ స్కూల్ అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు విద్యా బోధన అందిస్తూ అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నందున విద్యార్థులు విజయాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి సిద్ధార్థ జైన్, స్కూల్ అధ్యక్షురాలు మోనికా సుమన్, కరస్పాండెంట్ టి.సుమన్‌త్యాగరాజ్, ప్రముఖులు రోలాండ్ విలియమ్స్, హరిచరణ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14 నుంచి ఆటల పోటీలు

పి.నైనవరం(విజయవాడరూరల్): నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి పి.నైనవరం గ్రామంలో ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, అదే రోజు సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు, 15న లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు, 16న డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు 16వ తేదీ సాయంత్రం బహుమతుల ప్రధానం చేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 93478 89689 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత పనులు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో గురువారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి మినీ జేసీబీతో పూడికతీత పనులు నిర్వహించారు. ప్రధాన గ్రామంలో బీఎంపీఎస్ రోడ్డు, బల్లెంవారి వీధి, పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన మట్టిని పూడిక తీశారు. మట్టిని తొలగించి ట్రాక్టర్ల సహాయంతో డంపింగ్ యార్డులకు తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కొంతకాలంగా పూడికతీత పనులను నిర్వహిస్తున్నామన్నారు. మురుగునీరు సజావుగా పారుదల లేక పోవడంతో ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉత్తమ వైద్య సేవల్లో పెనమలూరు ఫస్ట్

- జాతీయ స్థాయిలో 4 వెల్‌నెస్ సెంటర్లకు గుర్తింపు
- జిల్లాలో పెనమలూరుకే స్థానం



ఉత్తమ సేవల గుర్తింపు పొందిన కానూరు 5వ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్



కానూరు వైద్య సిబ్బంది

పెనమలూరు: కృష్ణా జిల్లాలో అత్యున్నత వైద్య సేవలు అందించిన పెనమలూరులో 4 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల్లో భాగంగా పెనమలూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు ఈ ఘనత సాధించాయి. వివరాల్లోకి వెళితే పెనమలూరు మండలంలో (తాడిగడప కలిపి) రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ సెంటర్లకు అన్ని వసతులతో భవనాల నిర్మాణానికి సకాలంలో నిధులు మంజూరు చేయటంతోనే నేడు గ్రామాల్లో హెల్త్ సెంటర్లు అందరికి అందుబాటులోకి వచ్చాయి. సచివాలయాల పరిధిలోనే గ్రామాల స్థాయిలో వైద్య సేవలు ప్రజలకు పూర్తిగా అందుతున్నాయి. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఏడు మూండేటరీ సర్వీస్ ప్యాకేజీలు. గర్భిణులు, పిల్లలు, నవజాత శిశువులు, కుటుంబ నియంత్రణ, ఐదేళ్ల లోపు పిల్లలు, గాయాలకు చికిత్స, సంక్రమిత వ్యాధులకు చికిత్స వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ నాణ్యతా ప్రమాణ అధికారులు గత సెప్టెంబర్‌లో సందర్శించి తనిఖీలు చేశారు. హెల్త్ సెంటర్లలో క్షేత్రస్థాయిలో ఉత్తమ వైద్య సేవలు అందించినట్లు గుర్తించారు. నాలుగు సెంటర్లు 91 శాతం వరకు సేవలు అందించినట్లు ధ్రువీకరించారు.

నాలుగు కేంద్రాలకు గుర్తింపు..

అధికారులు చేసిన తనిఖీల్లో కానూరు మురళీనగర్ 5, చోడవరం, గోసాల – 2, గంగూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ ఉత్తమ సేవలు అందించినందుకు ఆయా కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్ ఇచ్చింది. పూర్తి వైద్య ప్రమాణాలు పాటించిన గోసాల – 1, వణుకూరు –1కు కూడా త్వరలో సర్టిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోనే పెనమలూరుకు ఉత్తమ వైద్య సేవల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. వైద్య సేవల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి పెనమలూరు బాసటగా నిలిచింది. జాతీయ స్థాయిలోనే పెనమలూరుకు ఖ్యాతి దక్కటంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన వైద్య సేవలు..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లోకి హెల్త్ సెంటర్లలో నాణ్యమైన వైద్య సేవలతో పాటు మందులు ఉచితంగా ఇస్తున్నాం. తమ వైద్య సేవలు గుర్తించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్ 4 కేంద్రాలకు రావటం ఆనందంగా ఉంది. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వణుకూరు 2కు కూడా గతంలో గుర్తింపు లభించింది. జిల్లా వైద్యాధికారి గీతాబాయి సహకారంతో ఉత్తమ సేవలు అందించగలిగాం. లక్ష్యం సాధించిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు.

– బి.శ్రీనివాస్, మండల వైద్యాధికారి, పెనమలూరు

దేవాలయాలకు ఇన్‌చార్జి ఈఓల నియామకం

పెనమలూరు: పెనమలూరు, కంకిపాడు మండలాల్లో దేవాలయాలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమిస్తూ ఎండోమెంట్ కమిషనర్ భ్రమరాంబ ఉత్తర్వులు జారీ చేశారు. పలు ఆలయాలకు ఈఓగా ఉన్న ఎల్.సత్యవతిపై పెనమలూరు గ్రామానికి చెందిన బద్రినారాయణ ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరుగుతుండటంతో సత్యవతి పని చేస్తున్న ఆలయాలకు ఇన్‌చార్జి ఈఓలను నియమించారు. పెనమలూరు శ్రీ సీతారామ లక్ష్మణస్వామి ఆలయం, తాడిగడప విజయ కనకదుర్గ ఆలయం, పెనమలూరు వేణుగోపాల, వెంకటేశ్వరస్వామివారి ఆలయం, పెదపులిపాక చెన్నమల్లేశ్వర స్వామివారి ఆలయం, యనమలకుదురు సంతాన వేణుగోపాలస్వామివారి ఆలయం, వేల్పూరు శ్రీసీతారామస్వామివారి ఆలయం, కంకిపాడు శ్రీమల్లేశ్వరస్వామివారి ఆలయాలకు ఇన్‌చార్జి ఈఓగా బి.సుబ్బారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పెనమలూరు భీమేశ్వర స్వామివారి ఆలయం, చోడవరం చెన్నకేశవస్వామివారి ఆలయం, చోడవరం సోమేశ్వరస్వామివారి ఆలయం, ఈడుపుగల్లు పర్వతనేని ధర్మ చెరువు, ఈడుపుగల్లు వీరభద్రస్వామివారి ఆలయాలకు యూవీ.ప్రసాదరావును ఈఓగా నియమించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



వాలీబాల్ విజేత ప్రొద్దుటూరు మహిళా జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు



కానూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమిషనర్ ప్రకాశరావు



కబడ్డీ ఆడుతున్న మహిళా క్రీడాకారులు



క్రికెట్ పోటీలో గెలుపొందిన రామవరప్పాడు టీమ్



బాపులపాడులో పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కంకిపాడు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు, పునాదిపాడు గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను అధికారులు నిర్వహిస్తున్నారు. వివిధ క్రీడాంశాల్లో మహిళ, పురుషుల జట్లు పోటీ పడుతున్నాయి. ప్రొద్దుటూరు మహిళల వాలీబాల్ జట్టు విజయాన్ని సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. పోటీలను సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి..

పెనమలూరు: క్రీడాకారులు ప్రతిభ చాటాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించటానికి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులు ఇది మంచి వేదికని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు సమర్థవంతంగా ఆడి తన సత్తాచాటాలని సూచించారు. కబడ్డీ, క్రికెట్, షటిల్ పోటీలు నిర్వహించారు.

పెనమలూరులో..

పెనమలూరు మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఏఓ లోయ శివశంకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ పోటీలను మండల స్థాయిలో నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు ఆసక్తిగా పాల్గొన్నారు.

24న నియోజకవర్గస్థాయి పోటీలు

ఉంగుటూరు: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో మహిళలు తమ సత్తా చాటారు. తేలప్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మహిళలకు వాలీబాల్, కబడ్డీ పోటీలను గురువారం నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ ఫైనల్ పోటీల విజేతలను ప్రకటించారు. వాలీబాల్‌లో నందమూరు విన్నర్‌గా నిలవగా, కబడ్డీలో లంకపల్లి గ్రామాల వారు విజేతలుగా నిలిచారు. మండల స్థాయి విజేతలకు ఈ నెల 24న నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు పేర్కొన్నారు. అనంతరం మండల స్థాయి మహిళా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అమీర్ బాషా, ఎంఈఓ-2 సాంబశివరావు పాల్గొన్నారు.

నున్న జెడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ పోటీలు

నున్న(విజయవాడరూరల్): ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గురువారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. రామవరప్పాడు సచివాలయం 4, 5 టీముల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో రామవరప్పాడు 5 గెలుపొందినట్లు పీడీ వర్మ తెలిపారు. తర్వాత ఎనికేపాడు-1, నున్న 2 సచివాలయం టీమ్‌ల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో నున్న - 2 టీమ్ గెలుపొందింది. ఎనికేపాడు-1, రామవరప్పాడు-1 టీమ్‌ల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో ఎనికేపాడు టీమ్ గెలుపొందింది. పాతపాడు, నున్న - 1 టీమ్‌ల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో నున్న టీమ్ గెలుపొందింది. నున్న, రామవరప్పాడు టీమ్‌ల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో నున్న టీమ్ గెలుపొందిందని పీడీ తెలిపారు. నున్న-2, అంబాపురం మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో అంబాపురం టీమ్ గెలుపొందింది. నున్న, పాతపాడు టీమ్‌ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లో నున్న టీమ్ గెలుపొందింది.

హోరాహోరీగా క్రీడా పోటీలు

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో రెండో రోజు క్రికెట్ పోటీలను ఎంపీపీ అనగాని రవి, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య చేబ్రోలు లక్ష్మీ మౌనిక టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం పలు జట్ల గ్రామసచివాలయాల జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్ మ్యాచ్‌లు పోటాపోటీగా జరుగుతున్నాయి. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ అనిల్ కుమార్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

మండలంలోని కేసరపల్లికి చెందిన షూటింగ్ బాల్ జాతీయ క్రీడాకారుడు మాదాల కిరణ్‌కుమార్‌కు ఎంపీపీ అనగాని రవి ఆర్థిక సాయం చేశారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పుదిచ్చేరిలో జరగనున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు రాష్ట్ర జట్టుకు కిరణ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలకు వెళ్లేందుకుగాను కిరణ్‌కుమార్‌కు సాయం అందజేసినట్లు ఎంపీపీ తెలిపారు.

క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సక్కా గాంధీ, ప్రజాప్రతినిధులు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. వేలేరులో వాలీబాల్, కబడ్డీ, రేమల్లే జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఖో ఖో, బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో హుషారుగా పాల్గొన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు, ఎంఈఓ శ్రీరామ్ బాలసింగ్, పాఠశాల హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు, పలువురు వ్యాయామోపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా తోట కరుణ నియామకం



తోట కరుణ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

గన్నవరం: గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య సతీమణి తోట కరుణ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఎంసీ నూతన కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కమిటీ గౌరవ చైర్మన్ హోదాలో చైర్‌పర్సన్‌గా తోట కరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా నాగనబోయిన బాలమధురశ్రీ, మరో 15 మంది సభ్యులతో కమిటీని నియమించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో తోట వెంకయ్య, కరుణ దంపతులను ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. గౌసాని, పార్టీ నాయకులు ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. స్థానిక సంస్థలు, కార్పొరేట్ పదవుల్లో మహిళలకు 50 శాతం అవకాశాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పార్టీలో తమ సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు తోట దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఉంగుటూరు మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, బాపులపాడు మండల కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, సర్పంచ్ డొక్కు వెంకన్నబాబు, పార్టీ నాయకులు మేచినేని బాబు, ఎస్‌కెఎం ఎంఏ కలాం, పడమట సురేష్, వింత ఆదినారాయణరెడ్డి, తుల్లిమిల్లి ఏడుకొండలు, కందిమళ్ల శ్రీనివాసరావు, పామర్తి మాధవ, రాచేటి రూతుమ్మ, గొన్నూరు సీమయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మాట్లాడుతున్న డీసీపీ చక్రవర్తి

పెనమలూరు: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను ప్రారంభించి ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ భద్రతలో భాగంగా హెల్మెట్‌లు, సీట్ బెల్టులు ధరించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరమన్నారు. సురక్షితమైన ప్రయాణం చేయటానికి ప్రతి ఒక్కరూ భద్రత పాటించాలని చెప్పారు. అదనపు డీసీపీ ప్రసాద్ మాట్లాడుతూ.. ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. సిగ్నల్స్ పడిన సమయంలో వాహనాలు నిలుపుదల చేయాలన్నారు. సైకిల్‌పై ప్రయాణం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. డీన్ బావినేని పాండురంగారావు మాట్లాడుతూ.. డ్రైవింగ్ సమయంలో మన ప్రాణంతో పాటు తోటి ప్రయాణికుల ప్రాణాలు కూడా చాలా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీ షర్టులు, క్యాప్‌లు, పంపిణీ చేశారు. విద్యార్థులు నగరంలో వివిధ ట్రాఫిక్ కూడళ్ల వద్ద విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారులు సుంకర రాము, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



వణుకూరులో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వెంకట శివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ తదితరులు



ఉయ్యూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్మన్ నాని, వైస్ చైర్మన్ సోలే తదితరులు

పెనమలూరు: అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య అన్నారు. వణుకూరు గ్రామంలో సామాజిత సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రతి ఒక్కరూ తమ హక్కులు పొంది వినియోగించుకుంటున్నారన్నారు. విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహం ఎందరికో స్ఫూర్తి కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఈఓ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అమలు దిశగా సీఎం జగన్ పాలన

ఉయ్యూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో సామాజిక సమతా కార్యక్రమం గురువారం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 19వ తేదీన విజయవాడ నడిబొడ్డున నిర్మించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, సంతకాలు సేకరించారు. చైర్మన్ వల్లభనేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రాజ్యాంగబద్ధంగా పాలనలో ప్రజలకు చేరువ చేశారన్నారు. వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ వాదులు, వైఎస్సార్ సీపీ శ్రేణులంతా 19న జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, కమిషనర్ పామసం వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ విమాదేవి, వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం తదితరులు పాల్గొన్నారు.

నేడు కంకిపాడులో ఉచిత వైద్యశిబిరం

కంకిపాడు: లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో కంకిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కె.నాగమల్లేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు తెలుపుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ఉంగుటూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. పొట్టిపాడు గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవినీతి రహిత పరిపాలన అందుతుందన్నారు. ప్రజలకు చేసిన సంక్షేమం, అభివృద్ధి ఎప్పటికప్పుడు సచివాలయాల వద్ద జాబితాలను ప్రదర్శనగా ఉంచుతున్నామని చెప్పారు. అనంతరం గ్రామాభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పొట్టిపాడులో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యక్షంగా రూ.13.67కోట్లు లబ్ధి చేకూరిందని, పరోక్షంగా రూ.5.40 కోట్లు ప్రయోజనాలు లభించాయని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ కత్తుల జ్యోతి, మండల సచివాలయాల కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, కార్యదర్శి అప్పారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దాడి ఘటనలపై కేసుల నమోదు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో పాతకక్షలతో దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు అజయ్‌నగర్ కాలనీకి చెందిన షేక్.హజరాబీకి అదే గ్రామానికి చెందిన పెదశివయ్య, ఇబ్రహీం, శ్రీను, కరిముల్లా, త్రినాథ్‌లతో కుటుంబ తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పై వ్యక్తులు హజరాబీ, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

యువకుడిపై దాడి.. ఫిర్యాదు

పెనమలూరు: యువకుడిపై దాడి చేసిన రౌడీషీటర్‌తో పాటు పలువురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సాలిపేటకు చెందిన కర్రి అప్పాయమ్మ కుమారుడు కర్రి స్వామి పెనమలూరులో చికెన్ షాపులో పని చేస్తున్నాడు. అయితే రౌడీషీటర్ గరికె సాంబశివరావు, గరికె కార్తిక్, లక్ష్మీపతి మరి కొందరు ఆటోలో చికెన్ షాపు వద్ద ఉన్న స్వామి వద్దకు వచ్చి ఫోన్ విషయమై గొడవ పడి అతడిని బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని సమీపంలో ఉన్న అరటి తోటలోకి తీసుకు వెళ్లారు. అక్కడ స్వామిని కట్టి వేసి దాడి చేశారు. ఫోన్ ఇవ్వకపోతే చంపుతానని బెదిరించారు. ఆ తరువాత ఇంటికి చేరుకున్న స్వామి కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువతిని వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు

పెనమలూరు: ప్రేమ పేరుతో యువతిని వేధించిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డుకు చెందిన డి.ఉమ రెండో కుమార్తె(26) గుజరాత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవారు. ఆమెతో మూడేళ్లుగా అయ్యప్పనగర్‌కు చెందిన ఇసుకపల్లి హనుమాన్ సందీప్‌తో పరిచయం ఉంది. యువతిపై అనుమానం పెంచుకొని వేధించసాగాడు. దీంతో యువతి అతనికి దూరంగా ఉండటంతో ఆమె పని చేసే వద్దకు వెళ్లి గొడవ చేయటంతో ఆమె ఉద్యోగం మానివేసింది. అక్కడి నుంచి ఆమె అక్క ఉంటున్న చెన్నైకి వచ్చింది. తనతో మాట్లాడాలని, తనతోనే ఉండాలని హనుమాన్‌సందీప్ మెసేజ్‌లు పెట్టి బెదిరించసాగాడు. తన కుమార్తెకు ప్రాణానికి హాని ఉందని తల్లి ఉమ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.